MOBILE MASALA

https://mobilemasala.com/

FRIDAY, 8 AUGUST-2025

# ‘మాస్ జాతర’ నుంచి ‘ఓలే ఓలే’ విడుదల

**భీమ్స్ సిసిరోలియో శైలిలో ఉత్సాహభరిత గీతంగా ‘ఓలే ఓలే’**


**తమ ఎనర్జీతో పాటను మరో స్థాయికి తీసుకెళ్ళిన రవితేజ-శ్రీలీల జోడి**



మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక 75వ చిత్రం ‘మాస్ జాతర’. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ‘మాస్ జాతర’ కోసం అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను మెప్పించి.. సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేసింది. మొదటి గీతంగా విడుదలైన ‘తు మేరా లవర్’ అందరినీ ఉర్రూతలూగించింది. ఇప్పుడు రెండవ గీతంగా ‘ఓలే ఓలే’ను విడుదల చేసింది చిత్ర బృందం. అందరూ కాలు కదిపేలా ఎంతో ఉత్సాహభరితంగా ఈ గీతముంది. ధమాకా జోడి రవితేజ-శ్రీలీల తెరపై కనిపిస్తే ఆ సందడే వేరు. ‘ఓలే ఓలే’ పాటతో ఈ జోడి మరోసారి ఆకట్టుకుంది. ఇద్దరూ పోటాపోటీగా నర్తించి పాటను మరో స్థాయికి తీసుకెళ్ళారు. రవితేజ తన వింటేజ్ స్టెప్పులతో అలరించారు. శ్రీలీల తన అసాధారణ నృత్య ప్రతిభతో మరోసారి కట్టిపడేశారు. ఇద్దరూ కలిసి ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా తెరపై మెరుపులు మెరిపిస్తున్నారు. సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో తనదైన శైలిలో స్వరపరిచిన ‘ఓలే ఓలే’ మాస్ రాజా అభిమానులకు, మాస్ ప్రేక్షకులకు విందు భోజనంలా ఉంది. థియేటర్లలో ప్రేక్షకుల చేత.. ఈలలు, చప్పట్లతో స్టెప్పులు వేయించేలా ఎంతో ఉత్సాహభరితంగా ఈ గీతం సాగింది. ఇక ప్రతిభావంతులైన రోహిణి సోరట్ తన గాత్రంతో పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. భాస్కర్ యాదవ్ దాసరి అందించిన సాహిత్యం ఉల్లాసంగా, ఆకర్షణీయంగా ఉంది. పాట యొక్క మూడ్‌కి సరిగ్గా సరిపోయే మాస్ ఫ్లేవర్‌తో ఆయన సాహిత్యం నిండి ఉంది. సంగీతం, సాహిత్యం, గాత్రం అన్నీ చక్కగా కుదిరి.. ‘ఓలే ఓలే’ను అదిరిపోయే మాస్ గీతంగా మలిచాయి. దర్శకుడు భాను బోగవరపు.. రవితేజ అభిమానులతో పాటు, మాస్ ప్రేక్షకులు మెచ్చే విధంగా ‘మాస్ జాతర’ను మలుస్తున్నారు. పాటల విషయంలోనూ ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మాస్ రాజా వింటేజ్ వైబ్స్, కమర్షియల్ హంగులతో ఈ చిత్రంతో థియేటర్లలో మాస్ పండుగను తీసుకురాబోతున్నారు. వరుస ఘన విజయాలతో దూసుకుపోతున్న ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్యతో కలిసి ‘మాస్ జాతర’ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ‘మాస్ జాతర’ సినిమాపై అంచనాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. ఫుల్ మీల్స్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం ఆగస్టు 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.



రాశీఖన్నా



# సెప్టెంబర్ 12న వస్తున్న ‘లిటిల్ హార్ట్స్’

“90s మిడిల్ క్లాస్ బయోపిక్” ఫేమ్ మౌళి తనుజ్, “అంబాజీపేట మ్యారేజి బ్యాండు” మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్ లో నటిస్తున్న మూవీ “లిటిల్ హార్ట్స్”. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ్ రూపొందించారు. “90ం మిడిల్ క్లాస్ బయోపిక్” ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ “లిటిల్ హార్ట్స్” మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేశారు. “లిటిల్ హార్ట్స్” చిత్రాన్ని సెప్టెంబర్ 12న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ సందర్భంగా విడుదల చేసిన ప్రోమోలో తండ్రీ కొడుకులుగా మౌళి తనూజ్, రాజీవ్ కనకాల నటించిన సరదా సన్నివేశం ఆకట్టుకుంటోంది. ఫ్యామిలీ ఎమోషన్స్, ఎంటర్ టైన్ మెంట్ తో రూపొందించిన ఈ సినిమా కంటెంట్ నచ్చి ప్రముఖ నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి “లిటిల్ హార్ట్స్” చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. నటీనటులు: మౌళి తనూజ్, శివానీ నాగరం, రాజీవ్ కనకాల, ఎస్ ఎస్ కాంచి, అనిత చౌదరి, సత్య కృష్ణన్, తదితరులు. టెక్నికల్ టీమ్: రచన, దర్శకత్వం: సాయి మార్తండ్, ప్రొడ్యూసర్ :ఆదిత్య హాసన్, పీఆర్ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ - శ్రీనివాస్), మ్యూజిక్ : సింజిత్ యెర్రమల్లి, సినిమాటోగ్రఫీ:సూర్య బాలాజీ, ఎడిటర్ : శ్రీధర్ సొంపల్లి, ఆర్ట్ డైరెక్టర్: దివ్య పవన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ : వినోద్ నాగుల, మురళి పున్న

MM MOBILE MASALA
https://mobilemasala.com/
FRIDAY, 8 AUGUST-2025



# ‘ప్రేమలో రెండోసారి’ లిరికల్ వీడియో విడుదల



సాకే రామయ్య సమర్పణలో సిద్ద క్రియేషన్ బ్యానర్ లో సత్య మార్క దర్శకత్వంలో ప్రొడ్యూసర్ సాకే నీరజ లక్ష్మి నిర్మిస్తున్న చిత్రం ‘ప్రేమలో రెండోసారి’. ఈ చిత్రానికి సంబంధించి లిరికల్ వీడియో సాంగ్ ని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, చార్టెడ్ అకౌంటెంట్ బి. వేణుగోపాలస్వామి చేతుల మీదుగా లిరికల్ వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా బి. వేణుగోపాలస్వామి మాట్లాడుతూ.. ‘ప్రేమలో రెండోసారి’ చిత్ర టైటిల్ చాలా బాగుంది. ఈ జనరేషన్ యువతకు ఈ సినిమా ఎంతో నచ్చుతుందని, ప్రతి ఒక్కరి జీవితంలో ఒకసారి ప్రేమకు దూరమైనప్పుడు ఏదో ఒక సందర్భంలో మరోసారి ప్రేమలో పడడం సహజం కాబట్టి తెలుగు ప్రేక్షకులకులందరినీ అలరిస్తుందని అన్నారు. సాంగ్స్ చాలా మెలోడీగా ట్రెండింగ్ గా ఉన్నాయని, కచ్చితంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందని.. మ్యూజిక్ డైరెక్టర్ రమణ సాకే ని అభినందించారు. ఈ సాంగ్ లోనే సినిమా ప్రతిభ , టీం యొక్క కృషి ఎంతగానో తెలుస్తుందని, టీం అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతూ వారిని అభినందించారు. ఈ సినిమా చక్కటి ప్రేక్షకాదరణ పొందుతుందన్న నమ్మకం నాకుంది అన్నారు. హీరో రమణ సాకే గుడ్ లుకింగ్ తో యువతను ఆకర్షించేలా నటించారని.. ఎన్నో సినిమాల్లో అవకాశం రావాలని టాప్ హీరోల స్థాయికి ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు . హీరో మరియు మ్యూజిక్ డైరెక్టర్ రమణ సాకే మాట్లాడుతూ.. ఈ సినిమాలో 7 సాంగ్స్ ఉన్నాయని, ప్రతి ఒక్కటి సందర్భానికి తగినట్లు చాలా మెలోడీగా వచ్చాయని, సినిమా మ్యూజిక్ మొత్తం ప్రేక్ష కులను మంత్రం ముద్దుల్ని చేస్తుందని సినిమా చూసేటప్పుడు ఆడియన్స్ వారిని వారు మరిచిపోయి సినిమాలో లీనమైపోతారని ఆ విధంగా ఈ సినిమా ఎంతో హిట్ అవుతుందని చెప్పారు.

# ‘ఎగరేయ్ నీ రెక్కలే..’

## ‘పరదా’ నుంచి బ్యూటీఫుల్ జర్నీ



సినిమా బండి ఫేమ్ దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల ‘పరదా’ అనే మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ తో వస్తున్నారు. ‘ది ఫ్యామిలీ మ్యాన్’ సిరీస్ మేకర్స్ రాజ్, డికె మద్దతు ఇస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా, దర్శన రాజేంద్రన్‌తో పాటు, సంగీత ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆనంద మీడియా బ్యానర్‌పై శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకడ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన గ్లింప్స్, టీజర్, సాంగ్స్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు మేకర్స్ థర్డ్ సింగిల్ ఎగరేయ్ నీ రెక్కలే పాటని రిలీజ్ చేశారు. ఎగరేయ్ నీ రెక్కలే బ్యూటీఫుల్ జర్నీ సాంగ్. స్టార్ కంపోజర్ గోపీ సుందర్ మనసు హత్తుకునేలా అద్భుతంగా కంపోజ్ చేశారు. వనమాలి రాసిన లిరిక్స్ మీనింగ్ ఫుల్ గా వున్నాయి. రితేష్ జి రావు తన వోకల్స్ తో మెస్మరైజ్ చేశారు. అనుపమ పరమేశ్వరన్, దర్శన రాజేంద్రన్, సంగీత జర్నీ ఎమోషనల్ అండ్ హార్ట్ టచ్చింగ్ గా వుంది. అద్భుతమైన లోకేషన్స్ తో చిత్రీకరించిన ఈ సాంగ్ విజువల్ గా చాలా గ్రాండ్ గా వుంది. ఈ సాంగ్ ఇన్స్టంట్ గా హిట్ అయ్యింది.

# ‘కింగ్‌డమ్’ విజయానికి కారణం బలమైన భావోద్వేగాలే...

## చిత్ర దర్శకుడు గౌతమ్ తిన్ననూరి



**విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన చిత్రం ‘కింగ్‌డమ్’. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే, వెంకటేష్ ముఖ్య పాత్రలు పోషించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. భారీ అంచనాల నడుమ జూలై 31వ తేదీన విడుదలైన ‘కింగ్‌డమ్’ చిత్రం.. ప్రేక్షకులను మెప్పు పొందుతూ భారీ వసూళ్లను రాబడుతోంది. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్ స్టర్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా.. వెండితెరపై ఓ కొత్త అనుభూతిని కలిగిస్తోందని, విజువల్ గా అద్భుతంగా ఉందని చూసిన ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. ‘కింగ్‌డమ్’ చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందన నేపథ్యంలో.. తాజాగా పాత్రికేయులతో ముచ్చటించిన చిత్ర దర్శకుడు గౌతమ్ తిన్ననూరి, పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.**

**కింగ్‌డమ్ విడుదలకు ముందు, విడుదల తరువాత ఎలా ఉన్నారు?**

-విడుదలకు ముందు చివరి నిమిషం వరకు కూడా తుది మెరుగులు దిద్దడానికి ప్రయత్నిస్తుంటాం. దాని వల్ల నిద్ర కూడా సరిగా ఉండదు. విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూశాక ప్రశాంతంగా నిద్రపోయాను.

**కింగ్‌డమ్ అనే టైటిల్ పెట్టడానికి కారణం?**

-ఏ సినిమాకైనా కథ రాసేటప్పుడు మొదట ఒక టైటిల్ అనుకుంటాం. జెర్సీ సినిమాకి కూడా మొదట అనుకున్న టైటిల్ 36. ఆ తర్వాత జెర్సీ టైటిల్ పెట్టాం. అలాగే, కింగ్‌డమ్ కథ రాసే సమయంలో కూడా కొన్ని టైటిల్స్ అనుకున్నాం. ఇందులో తెగ నాయకుడి పేరు ‘దేవర నాయక’. దాంతో అదే టైటిల్ పెట్టాలనుకున్నాం. కానీ, ఎన్టీఆర్ గారి దేవర రావడంతో.. మరో కొత్త టైటిల్ చూశాం. ‘యుద్ధకాండ’ అనే టైటిల్ ను పరిశీలించాం కానీ, చివరికి ‘కింగ్‌డమ్’ని ఖరారు చేశాం. కింగ్‌డమ్ అయితే అన్ని భాషల ప్రేక్షకులకు చేరువవుతుందనే ఉద్దేశంతో ఇది పెట్టడం జరిగింది. నా దృష్టిలో కింగ్‌డమ్ అంటే మనకి కావల్సిన వాళ్ళందరూ ఉండే ప్రాంతం లేదా మనం సురక్షితంగా ఉండే ప్రాంతం. ఒక్క మాటలో చెప్పాలంటే మన ఇల్లు లాంటిది.

**హృదయం లోపల పాటను తొలగించడానికి కారణం?**

-సినిమా విడుదలైన తరువాత.. అది చాలా పాపులర్ సాంగ్ కదా, దానిని ఎందుకు తొలగించారని అందరూ అడుగుతున్నారు. ఓటీటీ వెర్షన్ లోనైనా జోడించమని అడుగుతున్నారు. కథ రాస్తున్నప్పుడు ఆ సాంగ్ అవసరం అనిపించింది. కానీ, ఎడిటింగ్ సమయంలో కథ గమనానికి అడ్డంకిగా సాంగ్ మారింది అనిపించింది. అందుకే నేను, ఎడిటర్ నవీన్ నూలి గారు, నాగవంశీ గారు, విజయ్ గారు అందరం చర్చించుకొని.. హృదయం లోపల పాటను తొలగించాలని నిర్ణయించడం జరిగింది. ఓటీటీ వెర్షన్ లో ఆ సాంగ్ తో పాటు కొన్ని సీన్స్ కూడా జోడించే ఆలోచన ఉంది. నాగవంశీ గారితో చర్చించి దానిపై నిర్ణయం తీసుకుంటాం.

**ఈ కథ రాసుకున్నప్పుడే విజయ్ గారితో చేయాలి అనుకున్నారా?**

-ఈ కథ ఆలోచన ఎప్పటి నుంచో ఉంది. ఈ కథకు తగ్గ నటుడు దొరికినప్పుడు చేయాలనే ఉద్దేశంతో.. పూర్తిస్థాయిలో డెవలప్ చేయనప్పటికీ, కథను రాసి పెట్టుకున్నాను. మొదట విజయ్ గారితో చేద్దామనుకున్న కథ వేరు. కానీ, మా ప్రయాణం మొదలైన తరువాత.. విజయ్ గారికి ఈ కథ సరిగ్గా సరిపోతుంది అని భావించి, ఆయనకు చెప్పడం జరిగింది. విజయ్ గారికి కూడా ఈ కథ చాలా నచ్చింది.

**మళ్ళీరావా, జెర్సీ సినిమాలతో ఎమోషనల్ డైరెక్టర్ గా పేరు పొందారు. కింగ్‌డమ్ కి యాక్షన్ బాట పట్టడానికి కారణం?**

-ఏ కథయినా, ఏ సన్నివేశమైనా అందులో ఉన్న ఎమోషన్ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా చేయగలగాలి. కింగ్‌డమ్ విషయంలో కూడా అదే సూత్రం ఫాలో అయ్యాను. ఇందులో యాక్షన్ ఉన్నప్పటికీ, దాని చుట్టూ బలమైన ఎమోషన్ ఉంటుంది. ఆ ఎమోషన్ కనెక్ట్ అయింది కాబట్టే, యాక్షన్ వర్కౌట్ అయింది.

**మురుగన్ పాత్రకి కొత్త నటుడు వెంకటేష్‌ని తీసుకోవడానికి కారణం?**

-ఈ సినిమాలో విజయ్ గారు ఒక కొత్త ప్రపంచంలోకి అడుగుపెడతాడు. అక్కడ మనకు తెలిసిన నటుడు కంటే కూడా.. కొత్త నటుడైతే చూడటానికి ఆసక్తికరంగా ఉంటుంది అనిపించింది. ఈ క్రమంలో ఒక అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేష్ పేరుని సూచించడం జరిగింది. ఆడిషన్ సమయంలో సినిమా పట్ల, నటన పట్ల వెంకటేష్ తపన చూసి.. వెంటనే ఆయనను ఎంపిక చేశాము.

**సత్యదేవ్ గారి ఎంపిక గురించి?**

-శివ పాత్ర కోసం ముందు నుంచీ నేను సత్యదేవ్ గారినే అనుకున్నాము. కానీ, ఆయన వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. దానికితోడు అప్పుడు మా షూటింగ్ ఎప్పుడు మొదలవుతుంది అనే దానిపై స్పష్టత లేదు. ఎప్పుడైతే మాకు షూటింగ్ విషయంలో స్పష్టత వచ్చిందో.. అప్పుడు సత్యదేవ్ గారిని కలవడం జరిగింది. ఆయన కూడా కథ విని, సినిమా చేయడానికి వెంటనే అంగీకరించారు.

**ఈ వ్యవధిలో ‘మ్యాజిక్’ అనే సినిమా కూడా చేశారు కదా?**

-నాకు, వంశీ గారికి సంగీతం నేపథ్యంలో ఒక సినిమా చేయాలనే ఆలోచన ఎప్పటినుంచో ఉంది. కింగ్‌డమ్ షూటింగ్‌కి సమయం పడుతుండటంతో.. ఆ గ్యాప్ లో మ్యాజిక్ సినిమాని చేయడం జరిగింది. ఆ సినిమాకి ప్రధాన బలం సంగీత దర్శకుడు అనిరుధ్ గారు, సినిమాటోగ్రాఫర్ గిరీష్ గంగాధరన్ గారు.

**కింగ్‌డమ్ రెండో భాగం ఎప్పుడు మొదలవుతుంది?**

-రెండో భాగానికి సంబంధించిన మూల కథ ఉంది. స్క్రిప్ట్ వర్క్ కూడా త్వరలో ప్రారంభిస్తాం. అయితే పార్ట్-2 కంటే ముందుగా.. మురుగన్, సేతు పాత్రల నేపథ్యంలో ఓటీటీ కోసం ఓ వెబ్ ఫిల్మ్ చేయాలని భావిస్తున్నాము.

**దర్శకుడిగా ఈ ఎనిమిదేళ్ల ప్రయాణం ఎలా ఉంది?**

-ఇంకొన్ని ఎక్కువ సినిమాలు చేసి ఉండాల్సింది అనిపించింది. అయితే కొన్ని కొన్ని మన చేతుల్లో ఉండవు. కోవిడ్ కారణంగా రెండేళ్లు పోయాయి. అలాగే ఒక్కోసారి స్క్రిప్ట్ కోసం ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుంది. నా తదుపరి సినిమాలను వేగంగా పూర్తి చేయడానికి ప్రయత్నిస్తాను.



**-ఎం.డి అబ్దుల్**